సాక్షి ప్రకాశం

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



సీసాలో కళాపట్టె

రాచర్ల మండలం పాలకవీడు గ్రామానికి చెందిన తిరుమలాచారి గాజుసీసాల్లో పట్టేంత చిన్న వస్తువులను టేకు కర్రతో చేస్తూ అబ్బుర పరుస్తున్నాడు.

- 8లో..



ముగిసిన పొగాకు వేలం

పొదిలి పొగాకు వేలం కేంద్రంలో ఈ సీజన్‌కు పొగాకు వేలం శనివారంతో ముగిసింది. 12.29 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు జరిగాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వీవీ ప్యాట్‌లు సిద్ధం



వీవీ ప్యాట్‌లను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: స్థానిక భాగ్యనగర్‌లోని ఈవీఎం గోదాములో ఇటీవల బెంగళూరు నుంచి కొత్తగా వచ్చిన 6630 వీవీప్యాట్‌లను శనివారం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) రామిశెట్టి శ్రీలత పరిశీలించారు. డీఆర్‌ఓతో పాటు ఆర్‌డీవో విశ్వేశ్వరరావు వీవీ ప్యాట్స్‌లను పరిశీలించి బెల్ కంపెనీ ఇంజినీర్లతో ఒక్కొక్క వీవీ ప్యాట్‌ను, సింబల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం క్రమ సంఖ్య వేసి వీవీ ప్యాట్‌లను భద్రపరిచారు. రాబోయే ఎన్నికల్లో వినియోగించే వీవీ ప్యాట్‌లు కావడంతో క్షుణ్ణం రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలన చేశారు. దీనిలో ఎలక్షన్ సెల్ అధికారి శ్రీనివాసరావు, ఏఓ చిరంజీవి, వైఎస్సార్ సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీ ప్రతినిధులు రసూల్, సత్యం, మారుతీరావు, నవీన్, ఉపేంద్ర ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఐసీఎంఆర్ ఖాళీల భర్తీపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఖాళీల భర్తీపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయక మంత్రి ఎస్‌పీ సింగ్ బఘెల్ సమాధానమిచ్చారు. గత మూడేళ్లలో శాస్త్రీయ కేడర్ పోస్టులు 876, సాంకేతిక కేడర్ పోస్టులు 2811, పరిపాలన కేడర్ పోస్టులు 1580 పోస్టులు మంజూరయ్యాయన్నారు. 2023 నాటికి వరుసగా శాస్త్రీయ కేడర్ 142, సాంకేతిక కేడర్ 1230, పరిపాలన కేడర్ 799 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. శాస్త్రీయ కేడర్ 41 పోస్టులకు, సాంకేతిక కేడర్ 983 పోస్టులకు సంబంధించి నియామకాల ప్రక్రియ ఈ ఏడాదిలో నిర్వహిస్తామన్నారు. ఖాళీల సత్వర నియామకానికి ఐకార్ సంస్థ అనేక కార్యక్రమాలు చేపట్టిందని, కోవిడ్ మహమ్మారి ప్రభావంతో 2020–21, 2021–22 సంవత్సరాల్లో నియామక ప్రక్రియ బాగా మందగించిందన్నారు. ప్రస్తుత సంవత్సరంలో ఒక క్రమ పద్ధతితో నియామకాల ప్రక్రియ చురుకుగా సాగుతోందని, అనేక స్థానాల్లోని పరిపాలన కేడర్ పోస్టులు పునరుద్ధరించారని కేంద్ర మంత్రి తెలిపారు.

జేవీడీ నిధులకు ఈకేవైసీ చేయించాలి

ఒంగోలు: జగనన్న విద్యాదీవెన నిధులు జమయ్యేందుకు విద్యార్థులు తప్పనిసరిగా సమీపంలోని సచివాలయంలో ఈకేవైసీ చేయించాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీ జగనన్న విద్యాదీవెన మూడో విడత నిధులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేస్తారని సమాచారం అందిందన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వారి పరిధిలోని అర్హులైన విద్యార్థులచే ఈకేవైసీ తీసుకోవాలని సూచించారు.

పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవిచంద్ర



రవిచంద్రను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం: పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎం రవిచంద్ర కుమార్ ఎన్నికయ్యారు. శనివారం ఏలూరులో జరిగిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ కార్యవర్గ సమావేశంలో అధ్యక్షునిగా ఎం సంపత్ కృష్ణ (నెల్లూరు), కోశాధికారిగా టీ రాజబాబులను ఎన్నుకున్నట్లు రవిచంద్ర తెలిపారు.

వందేళ్ల గురుతు..!

107 ఎంతో అపూర్వం...

సండే స్పెషల్

ఇదే పాఠశాలలో చదివారు..పట్టుదలతో విద్యాబుద్ధులు నేర్చుకుని బంగారు బాటలు వేసుకున్నారు. ఉన్నత చదువులు చదువుకుని నేడు గురువులుగా మారారు. అరుదైన అనుభూతిని సొంతం చేసుకున్నారు. మూడు దశాబ్దాల కిందట ఆ స్కూలులో చదువుకున్న నలుగురు పూర్వ విద్యార్థులు అక్కడే ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పాఠశాల అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్నారు. "ఒకప్పుడు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుంటే వినేవారమనీ. ఇప్పుడు తాము అక్కడే విద్యార్థులకు చదువు చెబుతుంటే పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయని వారు మురిసిపోతున్నారు. వీరి గురించి తెలుసుకోవాలంటే వందేళ్ల చరిత్ర ఉన్న మార్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పోదాం పదండి..

- చదివిన పాఠశాలలోనే గురువులై..
- పుట్టిన ఊరుకు..చదివిన బడికి సేవ
- వందేళ్ల పాఠశాలకు మరింత వన్నె తెచ్చేలా
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- స్టడీ అవర్స్ నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తూ



మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

> **ఇక్కడ పనిచేయడం ఒక మంచి అనుభూతి**
>
> 
>
> 107 సంవత్సరాల చరిత్ర కలిగిన మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో టీచరుగా ఉద్యోగం చేయడం మంచి అనుభూతినిస్తుంది. ఇక్కడ పనిచేయడం ద్వారా గుర్తింపు, గౌరవం వస్తుంది. విద్యార్థులు కూడా ప్రతిరోజూ పాఠశాలలకు వస్తుంటారు. ఉపాధ్యాయులు మంచి కమిట్‌మెంట్‌తో పనిచేస్తారు. ఈ సారి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తాం.
>
> – మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీ బాయ్స్ స్కూల్

ఒంగోలు డెస్క్

పశ్చిమ ప్రకాశానికి గుండె వంటిది మార్కాపురం. ఈ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 107 సంవత్సరాల చరిత్ర ఉంది. నాటి బ్రిటీష్ ప్రభుత్వం విద్యా బోధన కోసం 1916లో పాఠశాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో గిద్దలూరు, వినుకొండ, పొదిలి తదితర ప్రాంతాల నుంచి చాలా మంది చదువుకునేందుకు ఇక్కడికి వచ్చేవారు. జిల్లాలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందిన ఈ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న వారెందరో విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అంతేకాదు దేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్నతాధికారులుగా, రాష్ట్రంలో కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులుగా రాణిస్తున్నారు. జిల్లాలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత కేపీ కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి కూడా ఈ పాఠశాల పూర్వ విద్యార్థులే. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 1300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 49 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పెద్ద ఆట మైదానం, ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. జిల్లా విద్యాశాఖకే తలమానికంగా ఉన్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదిగా, గౌరవం, మంచి గుర్తింపుగా ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు భావిస్తుంటారు.

నలుగురు పూర్వ విద్యార్థులు..టీచర్లుగా

ప్రస్తుతం పాఠశాలలో 49 మంది ఉపాధ్యాయులు ఉండగా, అందులో నలుగురు పూర్వ విద్యార్థులు ఉండడం గమనార్హం. యక్కలి కోటేశ్వరరావు బయోలాజికల్, ఓర్సు గాలెయ్య ఫిజిక్స్, ఎం శివప్రసాద్ ఇంగ్లిషు, కేకే విశ్వేశ్వరరావు హిందీ టీచర్లుగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధిస్తున్నారు. స్కూలు, విద్యార్థుల అభివృద్ధికి సైతం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇక్కడే నివాసముంటూ పాఠశాల సమయానికి కంటే ముందుగానే తరగతి గదులకు వచ్చి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించడం వారి అంకితభావానికి నిదర్శనం. వీరితో పాటు ఇక్కడ పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు కూడా వీరి బాటలోనే పయనిస్తుండడం గమనార్హం. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న పలు సైన్స్ ఫెయిర్, ఇతర పోటీలు, క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి సత్తాచాటుతున్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు.



విద్యార్థులకు పాఠం చెబుతున్న పాఠశాల పూర్వవిద్యార్థి విశ్వేశ్వరరావు

1977లో పదో తరగతి పూర్తయింది



1977లో మార్కాపురం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాను. ఆ తరువాత డిగ్రీ, బీఈడీ చదివి టీచరు ఉద్యోగం వచ్చింది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాను. ఆరేళ్ల క్రితం మార్కాపురం జెడ్పీ పాఠశాలకు బయోలాజికల్ సైన్సు ఉపాధ్యాయునిగా వచ్చాను. చదువుకున్న పాఠశాలలోనే టీచరుగా రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నా. నా సొంత స్కూల్‌గా భావిస్తున్నా. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తాం.

– యక్కలి కోటేశ్వరరావు, బయోలాజికల్ టీచరు

చాలా సంతోషంగా ఉంది



నేను ఈ పాఠశాలలో 1988–89లో పదో తరగతి పూర్తి చేశాను. అప్పట్లో నాగులవరం గ్రామం నుంచి వచ్చేవాడిని. అప్పటికీ ఇప్పటికీ పాఠశాల పూర్తిగా మారిపోయింది. చదువుకున్న పాఠశాలకే టీచరుగా రావడం ఎంతో సంతోషంగా ఉంది. నేను చదువుకున్న పాఠశాల కావడంతో ప్రత్యేక అభిమానం. ఇటీవల సౌత్ ఇండియా స్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో నేను శిక్షణ ఇచ్చిన విద్యార్థులు బహుమతి పొందడం చాలా సంతోషంగా ఉంది. విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– ఓర్సు గాలెయ్య, ఫిజిక్స్ టీచర్

నా అదృష్టంగా భావిస్తున్నా



నేను ఈ పాఠశాలలో 1986–87 వ సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేశాను. నా బ్యాచ్‌మేట్స్ హెచ్‌ఎంలుగా, ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. అయితే చదువుకున్న పాఠశాలలో టీచరుగా పనిచేసే అదృష్టం నాకు మాత్రమే దక్కింది. ఇక్కడ టెన్త్ అయిపోయిన తరువాత ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ హిందీ, ఎంఈడీ చేసి టీచరు ఉద్యోగం సాధించాను. పాఠశాల పనివేళలే కాకుండా ఎప్పుడు అవసరం వచ్చినా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటాను. హిందీతో పాటు కాంపిటేటివ్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని వారికి ఇప్పటి నుంచే అన్నీ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నాను.

– కేకే విశ్వేశ్వరరావు, హిందీ టీచరు

ఇది నా సొంత స్కూల్



నేను ఇక్కడే పుట్టాను. ఇదే పాఠశాలలో 1978–79లో పదో తరగతి పూర్తిచేశాను. టీచర్ ఉద్యోగం వచ్చిన తరువాత వివిధ ప్రాంతాల్లో పని చేశాను. అయితే ఇక్కడికి వచ్చిన తరువాత ఆ సంతృప్తి వేరుగా ఉంది. చిన్నప్పుడు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన విద్యా విధానాలు, పద్ధతులు గుర్తుకు వస్తున్నాయి. ఇంగ్లిషులో మంచి మార్కులు సాధించేందుకు మెళకువలు నేర్పుతున్నాను.

– ఎం.శివప్రసాద్, ఇంగ్లిషు ఉపాధ్యాయుడు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- నగరంలో వేగంగా అభివృద్ధి పనులు
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి



5వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ నగర్ ఒకటో వార్డు సచివాలయం పరిధిలోని గోపాల్ నగర్, భగత్ సింగ్ నగర్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు నగరంతో పాటు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించటమే లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల ఇబ్బందులు ఏమైనా ఉంటే నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా చేసుకొని పాలన సాగిస్తుందని వెల్లడించారు. నగరంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అందుకే ధైర్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తున్నామన్నారు. గోపాల్ నగర్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఇప్పటికే ఒంగోలు నగరంలో 14 డివిజన్లు పర్యటించామన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, మహిళా విభాగం వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ఈదర సురేష్ బాబు, యనమల నాగరాజు, తాడి కృష్ణలత, బొమ్మినేని మురళి, 5వ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.సత్య నారాయణ రెడ్డి, జమ్ము శ్రీకాంత్, తాళ్ళపాలెం శ్రీను (కొల్లూరు), వాకా తిరుమల, పి.మోహన్ రావు, బొట్ల సుబ్బారావు, ఆసోది విజయలక్ష్మి, విక్కీ వెంకటేశ్వర్లు, ఎస్‌కే.ఖుద్దూస్, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్, మిరియం సుబ్బులు, గఫూర్, మూసుబ్, దాసరి అమ్మన్న, మద్దసాని సుబ్బారావు, మిరియం వెంకటేశ్వర్లు, కే.నివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిననాటి నుంచి ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారని, ఈ మేరకు నవరత్నాల పథకాలను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని మొగుళ్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ తాను ఇచ్చిన మాట ప్రకారం 99.5 శాతం నెరవేర్చారన్నారు. మిగిలిన 5 శాతం కూడా నెరవేర్చటానికి దేశంలో ఎక్కడా లేనివిధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలుపరచి అధికారులను ప్రజల వద్దకు పంపి సమస్యలను అక్కడికి అక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ముందుగా మొగుళ్లపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, వై.మునలారెడ్డి, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, పీఆర్ డీఈ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

క్లుప్తంగా

జెఫ్ గౌరవ సలహాదారునిగా జాలిరెడ్డి

ఒంగోలు టౌన్: గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఫ్) గౌరవ సలహాదారునిగా కేశవరపు జాలిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం గుంటూరులో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. తన ఎన్నికకు కారకులైన గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలత, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.10,84,729

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి ఎ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.10,84,729 వచ్చినట్లు ఏవో కేబీ శ్రీనివాసరావు తెలిపారు. కుంకుమార్చన రూ.29,240, తలనీలాలు రూ.47,825, ప్రత్యేక దర్శనం రూ.3,31,700, లడ్డు ప్రసాదాలు రూ.2,03,290, అన్నదానం రూ.3,83,258, రూమ్‌అద్దెలు రూ.30,040 కలిపి రూ.10,84,729 వచ్చినట్లు తెలిపారు.

సీసాలో కళ పట్టె

● పాలకవీడువాసి అద్భుత ప్రతిభ



సీసాలో ఉన్న నాగలి, విత్తనపు గొర్రు



సీసాలో ఏర్పాటు చేసిన పట్టె మంచం

రాచర్ల: మండలంలోని పాలకవీడు గ్రామానికి చెందిన ముత్తోజు తిరుమలాచారి అనే యువకుడు తన ప్రతిభతో ఔరా అనిపించుకున్నాడు. టేకు కర్రతో అత్యంత చిన్నవైన విత్తనపు గొర్రు, నాగలి, పట్టె మంచాలను తయారు చేసి వాటిని సీసాలో అమర్చాడు. కులవృత్తి చేసుకుంటూనే తన ప్రతిభకు పదును పెట్టాడు. వ్యవసాయ పనిముట్ల తయారీ అనంతరం వాటిని సీసాల్లో అమర్చాడు. మూడు ఇంచ్‌ల రంధ్రంలో నుంచి సీసాలోకి కర్రను పంపించి దాని లోపలి భాగంలో మంచాన్ని తయారు చేశాడు. అంతే కాకుండా దానిని అల్లడం మరో విశేషం. మంచం చేయడానికి ఒక్కరోజు సమయం పట్టిందని, మంచాన్ని దారంలో అల్లేందుకు మూడు రోజుల సమయం పట్టిందని తిరుమలాచారి తెలిపాడు. విత్తనపు గొర్రు సీసాలో అమర్చేందుకు దాదాపు 4 రోజుల సమయం పట్టిందని, గొర్రుకు ఉండే ఇసుక కర్రలు, పాళం వేసేందుకు మరో 2 రోజుల సమయం పట్టిందని, అలాగే నాగలి తయారు చేసి సీసాలో ఏర్పాటు చేసేందుకు 3 రోజుల సమయం పట్టిందని తెలిపాడు. అంతేకాకుండా సీసాలో ఉడికిన కోడి గుడ్డుతో పాటు జాతీయ జెండాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపాడు.



కళాకారుడు ఎం.తిరుమలాచారి

కరవది పీఏసీఎస్‌కు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు



మంత్రి కాకాని గోవర్దన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వాకా వెంకటకృష్ణారెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)కు వరుసగా రెండోసారి ప్రకాశం జిల్లా స్థాయిలో ఉత్తమ సొసైటీ అవార్డు దక్కింది. శనివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సహకార శాఖామంత్రి కాకాని గోవర్దన్‌రెడ్డి చేతుల మీదుగా సొసైటీ చైర్మన్ వాకా వెంకటకృష్ణారెడ్డి రూ.50 వేల నగదు బహుమతి, మెమొంటో, సర్టిఫికెట్‌తో అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రూ.13 కోట్ల రుణాలు ఇవ్వడంతో పాటు రూ.13 కోట్ల డిపాజిట్లతో కలిపి మొత్తం రూ.27 కోట్ల టర్నోవర్‌తో సొసైటీ లాభాల బాటలో నడుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రోత్సాహంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి, శనగ రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేసి గిట్టుబాటు ధరలు అందించినట్లు వివరించారు. భారీ వర్షాలకు మూడుసార్లు పంట దెబ్బతిన్నప్పటికీ గిట్టుబాటు ధర లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. 2022–23 సంవత్సరానికి ఈ అవార్డు లభించిందని, 2021–22లోనూ సొసైటీకి ఉత్తమ అవార్డు దక్కిందని తెలిపారు. ఆయన వెంట సీఈవో రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇది మహిళా పక్షపాతి ప్రభుత్వం

● వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: మహిళా సాధికారత అంటే ఇలా ఉంటుందా.. అని చేసి చూపించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం జగన్ మహిళా సాధికారతను పెంపొందించేందుకు విప్లవాత్మక మార్పులు చేశారన్నారు. డ్వాక్రా గ్రూపు సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద నాలుగు విడతలుగా సొమ్మును బ్యాంకు అకౌంట్లలో జమ చేశారన్నారు. అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో నగదును జమ చేశారన్నారు. రాష్ట్రంలోని 9.50 లక్షల డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని, నాలుగు సంవత్సరాల్లో రూ.5 వేల కోట్లు పథకం కింద వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేశారన్నారు. మహిళా సాధికారతతో దేశంలో పరపతి పెరిగిందన్నారు. డ్వాక్రా మహిళలు కిరాణ షాపులు, హోటళ్లు, మహిళా మార్టులు వంటివి ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందుతూ దేశానికే ఆదర్శమవుతున్నారన్నారు. అలానే మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా సంఘాలకు చేసిందేమీ లేదన్నారు. వారికి మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారే గాని వారి సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. గతంలో చేయకుండా ఇప్పుడు మహిళాభివృద్ధికి ఏదేదో చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బురదజల్లే కార్యక్రమాలను చేస్తున్నారన్నారు. ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కడతారన్నారు.

ప్రమాదంలో మృతి చెందిన మహిళ గుర్తింపు

మార్టూరు: జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ మండలంలోని ఇసుక దరిశి గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని మహిళగా శనివారం పోలీసులు గుర్తించారు. ఎస్సై కె. కమలాకర్ వివరాల మేరకు.. జొన్నతాళి సెంటర్‌లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అయితే ఈమెను గుర్తు తెలియని యాచకురాలిగా స్థానికులు భావించారు. ఇలా ఉండగా ఇసుకదరిశి గ్రామానికి చెందిన వల్లపు గోవిందరాజులు మతిస్థిమితం లేని తన చెల్లెలు వల్లపు సుబ్బరావమ్మ (47) శుక్రవారం ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయిందని శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం ఉంచిన మహిళ మృతదేహాన్ని పోలీసులు గోవిందరాజులుకు చూపించగా మృతురాలు తన చెల్లెలు సుబ్బరావమ్మగా గుర్తించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జనసేన నేత స్వాములుపై కేసు

వేటపాలెం: జనసేన నేత ఆమంచి శ్రీనివాసరావు (స్వాములు)పై వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చీరాల డీఎస్పీ ఎస్. ప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట గ్రామ పంచాయతీకి చెందిన రెండు వార్డులకు జరుగుతున్న ఉప ఎన్నికల నామినేషన్ విషయంలో ఘర్షణ జరిగిందన్నారు. శనివారం పందిళ్లపల్లి గ్రామంలో జనసేన నాయకుడు ఆమంచి శ్రీనివాసరావు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కరణం వెంకటేష్‌ను పరుష పదజాలంతో దూషిస్తూ మాట్లాడారు. ఆ దూషణల వీడియోను తన ఇంటి వద్ద నుంచి సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పంపించారని చెప్పారు. వివిధ వర్గాల మధ్య శతృత్వం కలిగించే విధంగా, ప్రజల ప్రశాంతతకు భంగం కలించే విధంగా మాట్లాడటంతో అతని చర్యల వల్ల నియోజకవర్గంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందన్నారు. దీంతో 153 ఏ సెక్షన్ ప్రకారం వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ విధంగా ఎవరైనా ప్రజల మధ్య గొడవలు జరిగే విధంగా మాట్లాడినా లేదా సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా రెచ్చగొట్టే విధంగా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన పొగాకు వేలం



వేలం నిర్వహిస్తున్న గిరిరాజ్‌కుమార్

పొదిలి: పొగాకు రైతులకు ఈ సీజన్ బంగారమైంది. వాతావరణం అనుకూలించి సకాలంలో వర్షాలు కురవటంతో పొగాకు ఉత్పత్తి పెట్టుబడులు తగ్గాయి. మరో వైపు రైతుకు ప్రభుత్వ సహకారం ఉండటంతో కొంత మేర పెట్టుబడులకు కలిసి వచ్చింది. గతంలో ఎప్పుడూ లేనంతగా పొగాకు ధర పలికింది. పొదిలి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 2022–23 సీజన్‌కు సంబంధించి వేలం శనివారంతో ముగిసింది. ఈ సీజన్‌లో 12.29 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు జరిగాయి. 126 రోజులు వేలం జరిగింది. వేలం ప్రారంభం నుంచి రైతులకు అనుకూలంగా ధరలు వచ్చాయి. వ్యాపారులు ధరలు తగ్గిస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తరఫున పొగాకు కొనుగోలు చేయిస్తారనే భరోసా రైతులకు వచ్చింది. దీంతో వ్యాపారులు పోటీపడి ధరలు పెంచారు. దీంతో రూ.214.76 సగటు ధర పలికింది. పొగాకు వేలం చరిత్రలో ఈ ధరకు దరిదాపుల్లో కూడా ఎప్పుడూ లేదు. రూ.47.60 అధికంగా సగటు ధర వచ్చింది. పొగాకు ధరలు అనుకూలంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్పత్తిని నియంత్రించుకోవాలి:

పొగాకు ఉత్పత్తిని నియంత్రించుకోవటం రైతులకు చాలా ప్రధానం. ఈ ధర ఏటా ఉంటుందని భావిస్తే, రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. నాణ్యమైన పొగాకును తక్కువ పరిణామంలో ఉత్పత్తి చేసుకోవాలి. ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ముందుండాలి. దీనికి అవసరమైన సహకారం బోర్డు అందజేస్తుంది. – గిరిరాజ్‌కుమార్, వేలం అధికారి

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు

- కారు, ఆరు కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్
- పట్టుబడిన వారిలో బాలుడు
- జువైనల్ కోర్టుకు తరలింపు
- అనకాపల్లి జిల్లాలో ఘటన
- నిందితులంతా జిల్లా వాసులు



సీజ్ చేసిన గంజాయి, కారుతో దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నాగేంద్ర

దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న జిల్లాకు చెందిన ఐదుగురు యువకులను అనకాపల్లి జిల్లా దేవరాపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. దేవరాపల్లి ఎస్సై డి.నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నేలటూరు గ్రామానికి చెందిన వడ్డెల వాసు, వడ్డెల అనిల్, వడ్డెల పెదబాబు, రావూరి పవన్‌తో పాటు మరో బాలుడు (17) కారులో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మన్యానికి వెళ్లారు. అక్కడ ఆరు కేజీల గంజాయి కొనుగోలు చేసి పినకోట, దేవరాపల్లి మీదుగా ప్రకాశం జిల్లాకు పయనమయ్యారు. ఈ క్రమంలో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ కారులో గంజాయి తరలిస్తున్న ఐదుగురు యువకులను పట్టుకున్నారు. కారు, గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను చోడవరం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు. బాలుడ్ని జువైనల్ కోర్టుకు తరలించామని చెప్పారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

- గడప గడపలో ఎమ్మెల్యే కేపీకి ఘన స్వాగతం
- నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు

మార్కాపురం టౌన్: నవరత్నాల్లోని పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని 10వ వార్డు సచివాలయం పరిధి భగత్‌సింగ్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కౌన్సిలర్ దారివేముల హర్షితతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ నవరత్నాలాంటి పథకాలు అమలు చేసి పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. అర్హులు ఉంటే ఎవరి ఒత్తిడి లేకుండా నేరుగా పథకంతో లబ్ధి పొందవచ్చని ఎమ్మెల్యే కేపీ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో లబ్ధిదారుని అకౌంట్‌లో నేరుగా నగదు జమ అవుతోందన్నారు. ప్రభుత్వ పథకాల అమలుతో ప్రజల కష్టాలు తీరుతున్నాయని, ఆర్థికంగా కష్టాల నుంచి గట్టు ఎక్కుతున్నారని చెప్పారు. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్, జగనన్న విద్యాదీవెన, ఆసరా వంటి పథకాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయని పేర్కొన్నారు. గ్రామంలో ఎమ్మెల్యే కేపీపై పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యే కేపీకి పూల మాలలు శాలువాలతో సన్మానాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల కృష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్‌లు డాక్టర్ కనకదుర్గ, దొడ్డా భాగ్యలక్ష్మి, రంగలక్ష్మి, కొత్త కృష్ణ, సిరాజ్, నగేష్, వనజాక్షి, నాయకులు ఉస్మాన్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, కరీంబాషా, రోజ్‌లిడియా, ఆసిఫ్‌ఖాన్, షెక్షావలి, ఉత్తమ్‌కుమార్, డీఈ సుభానీ పాల్గొన్నారు.



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభం

భగత్‌సింగ్ కాలనీలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన సాగర్ పైపు లైన్లను, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు పత్తి రవిచంద్ర, బి.శేషయ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు కాలువ దుర్గ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

● కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

వెలిగండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోందని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. వెలిగండ్ల మండలంలోని అగ్రహారం, సూదనగుంట్ల గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అగ్రహారంలో ఎమ్మెల్యే బుర్రాకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. గడిచిన నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి వివరించారు. ప్రతి కుటుంబంలో లబ్ధిపొందిన వారి వివరాలు వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలులో ఏమైనా సమస్యలున్నాయా.? అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయ ఉద్యోగులను సంప్రదించాలన్నారు. పథకాల కోసం ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ మద్దతివ్వాలన్నారు. చంద్రబాబు అధికారం కోసం కుయుక్తులు పన్నుతున్నారని ఎమ్మెల్యే బుర్రా విమర్శించారు. చంద్రబాబు మాటలు వినే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. టీడీపీ, జనసేన మునిగిపోయే నావలని, ఆ పార్టీలిచ్చే హామీలను నమ్మవద్దని అన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు వారి హయాంలో రాష్ట్రాన్ని కొల్లగొట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.సుకుమార్, ఆరెకటిక కార్పొరేషన్ చైర్మన్ దాదా లక్ష్మీకుమారి, ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కె.పద్మావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ టి.దేవసహాయం, సర్పంచ్ వేమవరపు విమలమ్మ, ఎంపీటీసీ సభ్యులు రొండా రమణమ్మ, మాజీ ఎంపీటీసీ మారం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు వై.నాగూర్ యాదవ్, యెలికె నారాయణ, కె.వెంకట్రామయ్య, టి.నాని, మేడం ఆదిరెడ్డి, కంకణంపాడు పంచాయతీ నాయకులు దాదా సోమయ్య, మాలకొండరాయుడు, కొటికల రవిచెన్నయ్య, చిరంజీవి, అబ్రహాం, జార్జి, ప్రభాకర్, పాపారావు, హరికృష్ణ, గురేంద్ర, శంకర్, నరసింహారెడ్డి, చల్లా మాలకొండయ్య, చల్లా సత్యం, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్

● అక్కడికక్కడే వ్యక్తి మృతి

అద్దంకి రూరల్: ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈఘటన శనివారం మండలంలోని ధేనువుకొండ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. అద్దంకి మండలం కొంగపాడు గ్రామానికి చెందిన గుడిపూడి ప్రసాద్‌బాబు (48) మద్దిపాడు మండలంలోని గ్రోత్ సెంటర్‌లోని ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం బైక్‌పై పనికి వెళ్తుండగా మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ హదారిపై ధేనువుకొండ సమీపంలోకి రాగానే రోడ్డు పైన ఆగిఉన్న లారీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై అనిల్ కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతిగల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే ప్రసాద్‌బాబు ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



ప్రమాద స్థలంలో దుర్మరణం చెందిన ప్రసాద్‌బాబు